క్లుప్తంగా

మిషన్‌భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

కొల్లాపూర్: మిషన్‌భగీరథలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచేలా ప్రభుత్వంతో మాట్లాడాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి కార్మికులు వినతి అందజేశారు. ఆదివారం వారు ఎమ్మెల్యేను ఎల్లూరులో కలిశారు. జీఓ నం 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వారాంతపు సెలవులు, పండుగల సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ కార్మికులు రాము, షాబీర్ పాష, సాయిప్రసాద్, శంకర్, కర్ణాకర్, గట్టురాముడు, నిరంజన్, మహేష్ తదితరులున్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన సర్పంచ్

పెద్దకొత్తపల్లి: నక్కలపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సర్పంచ్ రాధిక ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించిన నిధులతో గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలి

కోడేరు: విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలని విశ్వబ్రాహ్మణుల మనుమయ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ, ఉపాధ్యక్షుడు కృష్ణమాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శివాలయంలో విశ్వబ్రాహ్మణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మండల కమిటీ, గ్రామ కమిటీలపై అవగాహన కల్పించారు. జిల్లా కోశాధికారి బాలరాజు, శ్రీనివాసులు, చిన్నఆంజనేయులు, కిట్టు, రఘు, నర్సయ్య, రవి పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే



అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంతో ఆదివారం విశ్వబ్రాహ్మణ, రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఫాదర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. అన్నీ తానై కొడుకులను ప్రయోజకులను చేసిన రేసోజు వాహనమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: నిరుపేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత డిమాండ్ చేశారు. ఆదివారం మల్కాపురంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇల్లు లేని వారిని సర్వే చేశారు. ఈ సందర్భంగా కందికొండ గీత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇస్తామని ప్రకటన చేసిందని, వాటిని తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు అశోక్, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు: దొరికిన ఆచూకీ

అచ్చంపేట: అచ్చంపేటకు చెందిన బాలుడు మంచిర్యాల రఘువర్ధన్(8) ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండాపోయిన బాలుడి ఆచూకీ పోలీసులు కన్నుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. అచ్చంపేట ఎస్‌ఐ గోవర్ధన్ చెప్పిన వివరాల ప్రకారం అర్టీసీ బస్టాండ్ వెనుక నివాసం ఉంటున్న రవికాంత్ తమ కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎస్‌ఐ పోలీస్ టీంలతో గాలింపు చర్యలు చేపట్టగా ఇందిరానగర్ కాలనీ వైపు వెళ్లినట్లు గుర్తించారు. స్నేహితుల వద్ద ఆటలు ఆడుతూ కనిపించిన బాలుడుని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి ఆచూకీ తెలియడంతో ఇటు పోలీసులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

బాలస్వామి సేవలు మరువలేనివి

కొల్లాపూర్: ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి యాపట్ల బాలస్వామి అలియాస్ అబ్కారీ స్వామి(65) అనారోగ్యంతో మృతిచెందాడు. కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో ఆయన చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆదివారం ఉదయం బాలస్వామి మృతదేహానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో బాలస్వామి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే అన్నారు. ఆయన మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. నరేందర్‌రెడ్డి, వెంకటస్వామి, చంద్రశేఖరాచారి, గాలియాదవ్, నర్సింహ, జూపల్లి వర్గీయులు హన్మంతునాయక్, రహీంపాష, నయూమ్, ఎక్బాల్ తదితరులు నివాళి అర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. 8వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బోయ బక్క నర్సింహ్మను, అదే వార్డుకు చెందిన బీరం బన్నుల వెంకట్‌రెడ్డిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.

అపర భగీరథుడు కేసీఆర్



కొల్లాపూర్‌లో మిషన్‌భగీరథ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల మహోత్సవం నిర్వహించారు. గ్రామాల్లోని నీటి ట్యాంకుల వద్ద మామిడాకులు, మామిడి తోరణాలు కట్టి రంగవల్లులతో అలంకరించారు.

- అపర భగీరథుడు కేసీఆర్ అని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామ సమీపంలోని మిషన్‌భగీరథ పంప్‌హౌజ్ వద్ద మంచినీళ్ల మహోత్సవం నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాజెక్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. తాగునీటి శుద్ధి, సప్లయ్‌కు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కృష్ణానది పక్కనే ఉన్నా తాగునీరు దొరకని పరిస్థితులు ఒకప్పుడు ఉండేవన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక మిషన్‌భగీరథ అనే పథకాన్ని రూపకల్పన చేసి, మారుమూల పల్లెకు కూడా రక్షిత తాగునీటిని అందిస్తున్న ఘనత కేసీఆర్‌దే అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు.

భగీరథ జలం ఆరోగ్య ఫలం

అసాధ్యం అనుకున్న తాగునీటి పథకాన్ని 2 లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వార ప్రజలకు తాగునీటిని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం రేవల్లి మండల పరిధిలోని గౌడుదేవుపల్లిలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం పనితీరును పరిశీలించి మాట్లాడారు. భగీరథ పథకం శతాబ్దాల నీటి గోసను తీర్చిందని, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకం నేడు పల్లెల్లో సత్ఫలితాలు ఇస్తుందన్నారు.

- తాగునీటికి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చేందుకు రూ.43వేల కోట్లు ఖర్చు చేసి ఇంటింటికీ నల్లనీరు అందించి వారి కష్టాలను తీర్చిన అపరభగీరథుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కొనియాడారు. ఆదివారం పట్టణంలోని మిషన్‌భగీరథ కార్యాలయ ఆవరణలో తాగునీటి దినోత్సవాన్ని దశాబ్ది వారోత్సవాల్లో భాగంగా నిర్వహించారు.
- తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రజలంతా మిషన్‌భగీరథ నీటిని వాడాలని, మిషన్‌భగీరథ నీటిలో విలువైన ఖనిజాలు ఉంటాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మిషన్‌భగీథ ముద్దు, ఆర్‌ఓ నీరు వద్దు అంటూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



తాడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కల్వకుర్తిలో ఏఈకి సన్మానం

ఉన్నత చదువులు చదవాలి



ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కందనూలు: పట్టణంలో సింగిల్‌విండో హాల్లో పెబ్బేటి మల్లికార్జున్ అధ్యక్షతన పదో తరగతి పాసైన విద్యార్థుల కోసం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్‌యార్డ్ చైర్మన్ గంగనమోని కిరణ్, డాక్టర్ శ్రీనివాస్, అడ్వకేట్ గొర్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడారు. ఒక ప్రాంతం గాని, ఒక సమాజం గాని అక్షరాస్యత సంపూర్ణంగా సాధిస్తేనే ఆ ప్రాంతం, ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని, విద్యాపరంగా వెనుకబడిన తెనుగోళ్ల జాతి విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నాణ్యమైన విద్యను, హాస్టల్ వసతులను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీటీఏ జిల్లా కార్యదర్శి వెంకటయ్య, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ గాలెన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆంజనేయులు, మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా ర్యాంకు సాధించిన సాయిప్రజ్ఞాన్



వంగూరు: మండలంలోని కోనాపూర్‌కి చెందిన సాయి ప్రజ్ఞాన్ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆల్‌ఇండియా స్థాయిలో 201వ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ శ్రీచైతన్య కూకట్‌పల్లి బ్రాంచ్‌లో ఇంటర్మీడియట్ చదివిన సాయిప్రజ్ఞాన్ ఆల్‌ఇండియా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సాయిప్రజ్ఞాన్ తండ్రి వంగూరు మండలం పోల్కంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

వెల్దండ: మండల పరిధిలోని ఎంజీ కాలనీతండాకు చెందిన లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన ఎంజీ కాలనీ తండాకు చెందిన ఫన్ని రూ.26 వేలు, ఆర్. వెంకటయ్యకు రూ.28 వేల చెక్కులను అందజేశారు.

ఎమ్మెల్సీని సన్మానించిన రైతులు...

మండలంలోని చెర్కూర్‌కి చెందిన రైతులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కేఎల్‌ఐ కాల్వలో భాగంగా డి-82 కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించడానికి ఎమ్మెల్సీ కృషి చేసినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, శేఖర్‌ముదిరాజ్, రాజశేఖర్, శంకర్‌నాయక్, హరికిషన్‌నాయక్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ కులస్తులకు బీసీ బందు అందించాలి

వెల్దండ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బీసీ బందు పథకాన్ని ముదిరాజ్ కులస్తులకు అందించి ఆదుకోవాలని ముదిరాజ్ సంఘం, యువజన మండల అధ్యక్షుడు బొక్కల శ్రీనివాస్‌ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. బీసీబంధు పేరుతో బీసీ కులాలకు చెందిన కొంత మందికి మాత్రమే రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తుందన్నారు. అదే విధంగా బీసీ-డీ నుంచి బీసీ- ఏ మార్చేలా ప్రభుత్వం పోరాటం చేయాలని ముదిరాజ్‌లకు పిలుపునిచ్చారు.

ఆన్‌లైన్ క్విజ్‌పై అవగాహన




అవగాహన కల్పిస్తున్న యువజన నాయకులు

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్‌లో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌పై ఆదివారం యువజన కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు విద్యార్థుల నైపుణ్యతను వెలికి తీసేందుకు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. 16 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన వారు పోటీ పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. జూలై 1వ తేదీ నాటికి చివరి గడువు ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలకు మూడు బహుమతులు అందిస్తామని, మొదటి విజేతకు ల్యాప్‌టాప్, రెండో విజేతకు స్మార్ట్‌ఫోన్, మూడో విజేతకు ట్యాబ్‌లెట్‌లను, ప్రోత్సాహక బహుమతులు అసెంబ్లీ స్థాయిలో 40 మంది వరకు వివిధ బహుమతులు అందజేస్తారన్నారు. అనంతరం కరపత్రాలను అందించారు. ఆసక్తిల వారి పేర్లు నమోదు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాహుల్, శ్రీనివాస్‌యాదవ్, చంద్రశేఖర్, శ్రీశైలం, వెంకటయ్య, శివ, సాలయ్య తదితరులు ఉన్నారు.

వర్షం కురవాలని వరుణ యాగం

మన్ననూర్: వర్షం కోసం లింగమయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో మాజీ వైస్ ఎంపీపీ సంభశోభ వెంకటరమణ ఆదివారం వరుణయాగం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పది రోజుల కిందట కురిసిన కొద్ది పాటి వర్షానికి సన్న చిన్నకారు రైతులు ఉన్న కొద్దిపాటి పొలాల్లో విత్తనాలు విత్తుకున్నారు. విత్తింది మొదలు కొని ఇప్పటి వరకు వర్షం కురువకపోవడంతో మొలకెత్తిన మొక్కలు అధిక ఉష్ణోగ్రతలకు ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో రైతులు మనోవేదనకు చెందకుండా ఆ వరుణుడు కరుణించి సకాలంలో వర్షాలు కురువాలని వరుణ యాగం నిర్వహించామన్నారు.

గురుకుల సీట్లు పొందిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ, తదితరులు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని కొండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురుకుల సీట్లు సాధించిన 21 మంది విద్యార్థులను ఆదివారం ఎంఈఓ చంద్రుడు, పాఠశాల హెచ్‌ఎం రమేష్‌నాయక్, సర్పంచ్ నల్లబోతుల గోపాల్, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, జటప్రోలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రుడు, సర్పంచ్, విండో చైర్మన్లు మాట్లాడారు. కొండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు వృత్తిపై అంకితభావంతో పనిచేస్తూ.. పేద విద్యార్థులకు చక్కని నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం 20కి పైగా గురుకుల సీట్లు సాధించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీసీఎం, టిప్పర్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

తెలకపల్లి: డీసీఎం, టిప్పర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో అచ్చంపేటకు చెందిన డీసీఎం నాగర్‌కర్నూల్ నుంచి అచ్చంపేటకు వస్తూ.. తెలకపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో డీసీఎంలో ఉన్న ఒకరికి కాలు విరిగింది. మరొకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని నాగర్‌కర్నూల్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ విషయమై పోలీసులను వివరాలు కోరగా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదని, వివరాలు పూర్తిగా తెలియదన్నారు. గాయపడిన వారు డ్రైవర్ బాలరాజు, తిరుపతయ్యలను నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ తరలించారు.

ఆర్థిక సాయం అందజేత

కొల్లాపూర్: పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ పాండు కుటుంబానికి ఆయన మిత్రులు రూ.1.70 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. పాండు ఇటీవలే గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో 1983-84 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన ఆయన మిత్రులు తమవంతుగా ఈ సాయం అందజేశారు. నగదు మొత్తాన్ని పాండు సోదరి రేణుకకు అందించారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటామని వారు వెల్లడించారు. సహాయం అందించిన వారిలో బాలస్వామి, భాస్కర్, సురేష్‌బాబు, కోళ్ల వెంకటేష్, నాగార్జున, పిరంగి గోవిందు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి..

వెల్దండ: మండల పరిధిలోని ఎంజీతండాకు చెందిన రాత్లావత్ బుజ్జి అనారోగ్యానికి గురైంది. ఆదివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, రఘునాయక్, హన్మంత్, పంతునాయక్, దేశ్య, జయరామ్‌నాయక్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో 20 రోజుల కిందట గుండెపోటుతో బాలపీరు మృతి చెందడంతో బాధిత కుటుంబానికి లిటిల్ సోల్జర్ యువజన సంఘం కమిటీ సభ్యులు పరామర్శించి ఆ కుటుంబానికి రూ.10,500 ఆర్థిక సాయం అందజేశారు. సాయిబాబు, లక్ష్మీకాంత్, రాంప్రసాద్, రాముడు, రాము రాజు, రాందాస్, పవన్ పాల్గొన్నారు.

పరామర్శ..

ఉప్పునుంతల: మండలంలోని రాయిచెడ్‌లో ఇటీవల కారు ప్రమాదంలో మృతిచెందిన అమృత, అణిత కుటుంబ సభ్యులను ఆదివారం టీడీపీ అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య సందర్శించి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు కాశన్న, ఎట్టయ్య తదతరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిసరాల పరిశుభ్రతపై మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదమ్మ మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామస్థాయి సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రతి నెలలో నిర్వహించే గ్రామసభలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాభివృద్ధికి చేయూతనిచ్చి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఎంపీడీఓ గంగామోహన్ మాట్లాడారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల్లో పంచాయతీ నిర్వహణ, ప్రజల నుంచి పంచాయతీకి వచ్చే పన్నులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, పాఠశాల విద్యార్థులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాఘవేందర్‌గౌడ్

కల్వకుర్తి రూరల్: ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన రూ.లక్ష రుణమాఫీ పథకాన్ని వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాలుగు సంవత్సరాలు దాటిన హామీ అమలు చేయలేదని ఆరోపించారు. రైతులు పండించిన వరి ధాన్యానికి 40 రోజులైనా డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందిలో ఉన్నారన్నారు. అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు రూ.10 వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహ, సీనియర్ నాయకుడు దుర్గాప్రసాద్, రవిగౌడ్, బాబిదేవ్, లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంపదను ప్రజలకు పంచాలి



మాట్లాడుతున్న దిలీప్ చారి

కందనూలు: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సంపాదించిన రూ.వేల కోట్ల అక్రమ సంపాదనను జాతీయం చేసి, నియోజకవర్గ ప్రజలకు పంచాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీప్‌చారి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో దిలీప్‌చారి విలేఖరులతో మాట్లాడారు. ఐటీ రైడ్స్‌లో మర్రి లీలలు అనేకం అని చెప్పారు. ఇటీవల నాలుగు రోజుల పాటు హైదరాబాద్ కేంద్రంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన దర్యాప్తు సంస్థకు రూ.వేల కోట్లు అక్రమ సంపద ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోందన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తొమ్మిదేళ్లలో నియోజకవర్గంలో సేవ పేరుతో నల్లమట్టి, అక్రమ ఇసుక, భూదందాలు, బినామీ కంపెనీల పేరుతో రూ.2 వేల కోట్లు అక్రమంగా సంపాదించినట్లు తెలుస్తోందని అన్నారు. దీనిపై బీజేపీ ఆధ్వర్యంలో ఈడీని కలిసి లికిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

25న జిల్లాకు జేపీ నడ్డా

మహజన సంపార్కు యోజన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25న జిల్లాకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాన్నుట్లు దిలీప్ చారి చెప్పారు. నిర్వహణ జాతీయ అధ్యక్షుడు పర్యటన, సభను జయప్రదం చేయడానికి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేపడుతున్నామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలోని శ్రీ అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య పర్వదినం కావడంతో శివుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమావాస్య పర్వదినం పురస్కరించుకుని వేదపండితులు స్వామివారికి తైలాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు మురారి శర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ ఉన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఆదివారం అమావాస్య రావడంతో తక్కువ సంఖ్యలో హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి బాబురావు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కొల్లాపూర్: కోడేరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కొల్లాపూర్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద యువకులు ఎమ్మెల్యేను కలిశారు. బీఆర్‌ఎస్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పారు. నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాజశేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో..

దోమలపెంట: ఇతర పార్టీలకు చెందిన యువకులు ఆదివారం స్థానిక ఎంపీటీసీ బి.మల్లిఖార్జున ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు డా.వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వంశీకృష్ణ యువకులందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అందరూ ఐక్యంగా కష్టపడి పార్టీ కోసం పని చేయాలని కోరారు. ఎంపీపీ శ్రీనివాసులు, ఛత్రూనాయక్, మోయిజ్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కొల్లాపూర్: చిన్నంబావి మండలం వెల్టూరుకి చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఆదివారం వారు కొల్లాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావును కలిశారు. ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. బీజేపీ బలోపేతానికి కృషిచేస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారిలో ప్రకాష్, పురుషోత్తం, పృథ్వీరాజ్, అజయ్‌కుమార్, మనోజ్, పురేందర్, శివకుమార్, వెంకటేష్ తదితరులున్నారు.

హైకోర్టు ఏజీపీకి ఘన సన్మానం

బిజినేపల్లి: తెలంగాణ హైకోర్టు ఏజీపీగా కొద్ది నెలల కిందట నియమితులైన కాసిరెడ్డి శశిధర్ రెడ్డిని రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆదివారం ఉదయం పాలెం శ్రీబాలాజీ గార్డెన్స్‌లో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏజీపీ కాసిరెడ్డి శశిధర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే ధృక్పథంతో తాను వృత్తిలో చేరానని, అందుకు తెలంగాణ ప్రభుత్వం కూడా తనకు సరైన అవకాశం కల్పించిందన్నారు. ఏజీపీ కాసిరెడ్డి శశిధర్‌రెడ్డిని ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నారాయణ్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు శాలువాలతో సన్మానించారు.



టీడీపీ లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా యాదిలాల్

కల్వకుర్తి రూరల్: టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా యాదిలాల్ ఆదివారం నియామకమయ్యారు. యాదిలాల్ టీడీపీ నియోజకవర్గ కోర్డినేటర్‌గా కొనసాగుతున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ యాదిలాల్‌ను నియమిస్తూ ఆదేశాలిచ్చారు. తనకు ఇచ్చిన అవకాశానికి పూర్తి న్యాయం చేస్తానని యాదిలాల్ విలేకర్‌లకు చెప్పారు. రావుల చంద్రశేకర్‌రెడ్డి, ప్రసన్న, మల్లయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ నుంచి మంత్రాలయం వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఆదివారం ఉదయం తృటిలో పెను ప్రమాదం తప్పింది. కోదాడ డిపోకు చెందిన టీఎస్ 29జెడ్ 0016 నంబర్ ఆర్టీసీ బస్సు నాగర్‌కర్నూల్ నుంచి బిజినేపల్లి మీదుగా మంత్రాలయం వెళ్తుంది. ఆ బస్సు పాలెం సమీపానికి రాగానే కాలిపోయిన చెట్టు కొమ్మ ఒక్కసారిగా ఆర్టీసీ బస్సుపై పడిపోయింది. దీంతో బస్సుపై ఉన్న క్యారేజ్ రోడ్డుపై ఊడి పడిపోగా, బస్సు అద్దాలు పగిలిపోయాయి. బస్సులో అప్పటికే 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదని, తృటిలో పెను ప్రమాదం తప్పిందన్నారు. ప్రయాణికులు మరో బస్సులో తమ గమ్య స్థానానికి వెళ్లిపోయారు. కాగా పాలెం నుంచి నల్లవాగు వరకు ఉన్న వృక్షాలు కొన్ని ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిపై ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకుని వాటి మరమ్మతు చేపట్టి సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.